స్వాతి వీక్లీ సీరియల్

# వలపు సంకెళ్ళు



బి. గీతిక

# వలపు సంకెళ్ళు

**ఇంకా వైజ్ఞానిక విప్లవపు గాలైనా సోకని తొంభైయవ దశకపు చివరి రోజులవి...!**

**పంచ భూతాలు కాలుష్యపు బారిన పడని స్వచ్ఛమైన సాయంత్రం అది..!!**

అది **అంగలూరు..!** అంగబలం, అర్థబలం అంతగాలేని పల్లెటూరు. ఎండి, మన్నులో కలిసిపోయిన ఆకులా.. అడుగంటిన చరిత్ర అట్టడుగు పుటల్లో మిగిలి పోయి, ఇప్పుడు మాత్రం ఇంకా అభివృద్ధికి నోచుకోని మారుమూల ప్రాంతమది.

**ఆ సాయంత్ర సమయంలో- రాత్రుల్లో ఉండేంత నిశ్శబ్దం నిండి ఉంది..! అప్పటివరకూ స్తబ్ధుగా ఉన్న గాలి ఒక్కసారిగా రయ్యిమంటూ పరుగులు పెడుతోంది. కొరడా ఝుళిపించిన శబ్దంలాంటి ఈల చప్పుడేదో గాలివెంట సన్నగా సాగిపోతోంది.**

చెవులు రిక్కించి వింటున్నట్లు బిగుసుకుపోయి ఊగుతున్నాయి తాటిచెట్లు.

ఎర్రమట్టి రోడ్డుకి అటూఇటూ కనుచూపుమేరవరకూ, కోతలైపోయిన పొలాలు బీడులవడానికి సిద్ధంగా భయం గొలిపేలా ఉన్నాయి. ఉన్నా లేనట్టున్న సన్నని పాయలాంటి పంటబోదె, 'జరిగినదానికి, జరగబోయే దానికీ నా ప్రమేయమేమీ లేద'న్నట్టు నిశ్శబ్దంగా చూస్తోంది.

పంటబోదెని ఆనుకుని ఉన్న గట్టుమీద గుబురుగా ఓ పెద్ద మామిడిచెట్టు.. దాని కింద ప్రపంచంతో సంబంధం లేనట్టున్న ఓ పడుచు జంట ఒకరిలో ఒకరన్నట్టుగా అల్లుకుని ఉన్నారు. యవ్వనంలో ఉన్న వారిద్దరిలో ఆనందం కేరింతలు కొడుతోంది. కొత్తగా పెళ్ళైన ఆ జంట కాత్యాయిని, రామచంద్ర.

తమపొలం చూపించినట్టు ఉంటుంది, చల్లగాలికి షికారుకొచ్చినట్టూ ఉంటుందని కాత్యాయినిని తీసుకొని వాళ్ళ పొలాల దగ్గరకి వచ్చాడు రామచంద్ర.

మామిడి చెట్టు కింద రామచంద్ర ఒడిలో పడుకుని భర్తతో సరసమాడుతున్న కాత్యాయిని, "ఈ చెట్టు కాయలు చాలా బాగుంటాయి అన్నారుగా.. నాకొక మామిడికాయ కొయ్యరూ.." అని ముద్దుగా అడిగింది.

వెంటనే భార్య కోరిక తీర్చడం కోసం చెట్టెక్కాడు రామచంద్ర. చెట్టెక్కి కాయలకోసం వెదుకుతూ, "అన్నీ పిందలే కాత్యా..! నాలుగు రోజులాగితే ఇంకొంచెం తయారవుతాయి. అప్పుడు కోస్తానులే..." అంటూ చెట్టు దిగబోయాడు అతను.

"ఒక్కటైనా దొరుకుతుందేమో చూడండీ.." అంటూ భర్త వంక చూస్తూ, గారంగా అడిగింది కాత్యాయిని.

ఆమె అలా అడగడంతో, కాదనలేక ఉన్నవాటిలో కాస్త పెద్దగా ఉన్న మామిడికాయని భార్యకి చూపిస్తూ, "ఇది కొయ్యమంటావా.. చూడు.." అని అడిగాడు రామచంద్ర.

"ఊ.. కొయ్యండి.." అని ఆనందంతో తెలూపిందామె.

ఆ కాయ కోసి చెట్టు దిగొచ్చి, ఆమె కళ్ళలోని ఆనందాన్ని ఇష్టంగా చూస్తూ నున్నగా నిగ్గుతేలిన మామిడి కాయని ఆమె చేతిలో పెట్టాడు రామచంద్ర. అపురూపంగా అందుకుని, ఓ సారి దానివంక తృప్తిగా చూసి; చిన్నముక్క కొరికి తిన్నది కాత్యాయిని. ఉన్నానన్న పేరుకి లోపలెక్కడో పులుపు తెలుస్తున్నా, ఆ కాయ చాలా తియ్యగా ఉందామెకి. రుచిని ఆస్వాదిస్తున్నట్టు కాత్యాయిని కళ్ళు అరమోడ్పులయ్యాయి.

"ఏయ్ కాత్యా..! ఎలా ఉంది..?" అని భార్య హావభావాల్ని గమనిస్తూ అడిగాడు రామచంద్ర.

"మీరు చెబితే నమ్మలేదుగానీ, నిజంగా అమృతంలా ఉందండీ...!" అంది ఆశ్చర్యంగా.

కాత్యాయిని ప్రశంసకి ఇష్టంగా.. భార్య భుజాలచుట్టూ చెయ్యేసి ప్రేమగా దగ్గరకి తీసుకున్నాడు రామచంద్ర. భర్త ప్రేమకి లోలోపల మురిసిపోతూ అతని గుండెల్లో ఒదిగి పోయిందామె. ఆ పరధ్యానంలో అనుకోకుండా ఆమె చేతిలోని కాయ గబుక్కున జారి కింద పడిపోయింది. క్షణంలోనే చటుక్కున వంగి నేలమీదపడ్డ కాయని తీసింది కాత్యాయిని.

**ఆ క్షణంలోనే..**

**నేలని తాకిన ఆ ఒక్క క్షణంలోనే..**

**చేతిలోంచి జారినకాయ.. నేలని తాకిన ఆ ఒక్క క్షణంలోనే..**

వేల సంవత్సరాలుగా అలాంటి అవకాశం కోసమే, వేయికళ్ళ వెలుగుచూపుల్తో ఎదురుచూస్తున్న ఓ జీవం.. అమాంతంగా ఆ మామిడికాయని అల్లుకుంది. అంతే..! ఒక్కసారిగా ఆ కాయ వజ్రంలా మెరుపులీనే కాంతుల్తో నిగనిగలాడి మళ్ళీ మామూలవడం.. రెప్పపాటుకి నూరో వంతు సమయంలో జరిగిపోయింది..! కానీ, అది వారిద్దరి దృష్టిలో పడలేదు..!

చేతిలోకి తీసుకున్న మామిడికాయని పరిశీలనగా చూసి, దానికి అక్కడక్కడా అంటుకునున్న మట్టి రేణువుల్ని ఉఫ్ మని నోటితో ఊది, తన ఓణీతో తుడిచేసింది కాత్యాయిని.

ఆ కాయవంక పరిశీలనగా చూస్తూ, "మట్టేమైనా ఉందేమో. ఇలా ఇవ్వు, కడుగుతాను.." అన్నాడు రామచంద్ర.

"పర్వాలేదు. పోయిందిలే.." అని, కాయని మరోసారి గుండ్రంగా తిప్పి చూసిందామె. కాయ శుభ్రంగానే కనిపించడంతో ఆత్రంగా ఇంకో ముక్క కొరికింది.

తెలుపుమీద నల్లని మట్టి రేణువులయితే కనబడతాయి. మరి, తెలుపుమీద వజ్రపు కాంతులీనే తెల్లనివి

అంటుకుంటే..? బహుశ వాళ్ళు బాగా గమనించుంటే కనపడేవేమో, ఆమె కొరికిన తెల్లని భాగానికి అంటుకున్న ఆ మెరుపులు..! మామిడి పిందెకి అయస్కాంతంలా అంటుకున్న ఆ మెరుపు ముక్కలు నిదానంగా కాత్యాయిని గొంతులోనుంచి లోపలకు చేరుతున్నాయి. నములుతుంటే గొంతులో ఏదో అడ్డుపడుతున్నట్టు అనిపించినా, రుచి ఇచ్చిన మైమరపులో దాన్నంతగా పట్టించుకోలేదు కాత్యాయిని.

**ఆ మెరుపు ముక్కల్లో-**

**శతాబ్దాల నాటి చరితలతో శైథిల్యమవక,**

**కథలుగా మిగిలిన జీవితాల గురుతులు ప్రేళ్ళూనుకొని ఉన్నాయి..!**

**ఆ మెరుపు ముక్కల్లోంచి బయటపడి-**

**ఎప్పుడు పుడదామా ఎప్పుడు పుడదామా.. అని అదృశ్యంగా వేచి చూస్తున్న జీవం,**

**ఆమె కడుపులోకి ఆమెకు తెలీకుండానే మెల్లగా చేరుతోంది..!**

**లోపలకి చేరిన ఆ జీవం-**

**తన సగభాగంకై పడే తపన, సంవేదనల్తో,**

**కాత్యాయిని గర్భకుహరంలోని అండాన్ని ఉద్వేగంగా అల్లుకుంది..!**

* * *

కాత్యాయినీ నీళ్ళోసుకుంది. ఆమెలో ఇదివరకు లేని సుకుమారం, నిగారింపు వచ్చి చేరాయి. మొదటిచూలని కాత్యాయినిని చాలా జాగ్రత్తగా చూసుకుంటున్నారు అందరూ.

నెలలు నిండుతున్న ఆమెని వాళ్ళ పుట్టింటివాళ్ళొచ్చి తీసుకెళ్ళారు. కాత్యాయినిలో కొత్తగా కనిపిస్తున్న వింతకాంతిని అక్కడి చుట్టుపక్కల వాళ్ళందరూ వచ్చి అబ్బురంగా చూసి వెళుతున్నారు. వాళ్ళలోని ప్రశంశాపూర్వక భావాలు ఆమెలో మొదటి మాతృత్వపు మమకారాన్ని మరింత పెంచాయి.

తొమ్మిది నెలలు గడిచిపోయాయి. పదవనెల వచ్చి పది రోజులు...! నెలలు నిండినా, నెప్పులు రావడం లేదేమిటన్న ఆలోచనలు మొదలయ్యాయి కాత్యాయినిలో. పదవనెల వచ్చేసినా ప్రసవం అవలేదు కాబట్టి, ఆడబిడ్డేమో అన్న సందేహం కాత్యాయిని వాళ్ళ అమ్మకి. కాత్యాయినిలో ఆరాటం మొదలైంది, పదినెలలొచ్చినా ఇంకా నెప్పులు రావేంటని..! అంతలోనే సంతోషం.. తన భర్తకిష్టమైన ఆడపిల్ల పుట్టబోతుందా అని..!

తరువాత రెండు రోజులకి... కడుపులో బిడ్డ తట్టుతున్నట్లనిపించి ఆమెలో కంగారు, గుండె కొట్టుకునే వేగం పెరిగింది.

**తాను పుట్టడం కోసం శతాబ్దాలుగా ఎదురుచూసిన ఆ జీవం..**

**మరుగున పడిపోయి మట్టిలో మట్టిగా ఉన్న**

**తన ఆలోచనలనూ, జ్ఞాపకాలనూ, తన జీవనాన్నీ..**

**అన్నింటినీ అన్నింటినీ.. ప్రోది చేసుకుంటూ -**

**ప్రాణం నింపుకుని సంపూర్ణ జీవిగా తయారై,**

**తల్లి గర్భాశయపు చీకటిలోంచి**

**బాహ్య ప్రపంచంలోకి రావడానికి సమాయత్తమౌతోంది..!**

ఎవరో లోపల సున్నితంగా తడుతున్నట్టుంది కాత్యాయినికి. నిముషాలు గడుస్తుంటే ఆ తట్టడం నెట్టడంగా మారింది. కడుపులో ఏదో మెలి తిరుగుతున్నట్టూ, మరేవో అవయవాల్ని చీల్చుతున్నట్టూ..! కొద్ది క్షణాల్లో ఏం జరగబోతుందన్నది అర్థమైంది ఆమెకి..!

అంతే... "అమ్మా.." అని గట్టిగా పిలిచిందామె. కడుపులో ఉన్న బిడ్డకి మొదటి మాట నేర్పుతున్నట్టుగా ఉందా పిలుపు..!

కూతురి పిలుపుకి పరుగున వచ్చింది కాత్యాయిని వాళ్ళ అమ్మ. కాత్యాయినిని చూడగానే అర్థమైనదానిలా, హుటాహుటిన ఆసుపత్రికి తీసుకువెళ్ళింది.

ఓ చెట్టునుంచి రాలినపండు.. మొలకెత్తే ప్రక్రియల్ని చూసి, అద్భుతం అనుకునే కాత్యాయినికి- తనలో జరుగుతున్న మార్పులు, విడివడుతున్న అవయవాలు, పట్టి లాగుతున్న పేగు బంధం.. అన్నీ కొత్తగా ఉన్నాయి. పొట్టలోని ప్రతి కదలికా స్పష్టంగా తెలుస్తోంది కాత్యాయినికి. తనలోంచి బిడ్డ బయటకొస్తున్న ప్రతీ క్షణాన్నీ అనుభూతిస్తోందామె..!

ఏ ఇబ్బందీ లేకుండానే కానుపైంది కాత్యాయినికి.

బిడ్డనీ, బిడ్డతల్లినీ చూసి.. అక్కడున్న అందరూ బిత్తరపోయారు. ఎందుకంటే ప్రసవపు బాధ తల్లిలో లేదు, క్యార్ మన్న ఏడుపు పిల్లలో లేదు. ఈ రెండూ ఒకెత్తయితే దివ్యమైన తేజస్సుతో ముట్టుకుంటే మచ్చపడేలా ఉన్న పాప అందం మరో ఎత్తు.

అవే కాకుండా పాప ఏడవాలని నర్సు తలక్రిందులుగా పట్టుకుని చరిచినప్పుడు, కిలకిలా నవ్విన పాపని చూసి అందరిలో ఒకటే కంగారు.. అదేంటీ పుట్టిన పసిపాప ఏడవకుండా నవ్వుతుందేంటని...! కానీ.. వారందరికీ తెలియని మర్మం ఒకటుంది.

'**అతను**' ఎప్పుడు పుడతాడా అని ఆ అవకాశంకోసం వేల సంవత్సరాలుగా ఎదురుచూసీచూసీ అది ఇప్పటికి సఫలం అయ్యాక- తన అభీష్టాన్ని నెరవేర్చుకోవడం కోసం ఆత్రుతతో ఎదురుచూస్తున్న పాపలోని అంతర్జీవానికి మాత్రమే తెలుసు ఆ మర్మం..!

అందుకే.. నిరీక్షణ ఫలించిన ఈ సమయంలో పాప దేహంలో ఉన్న జీవశక్తికి- తన జ్ఞాపకాల్నీ కలల్నీ నిజం చేసుకోబోతున్నందుకు.. సహజంగా వచ్చే ఏడుపుకంటే, ఎదురుచూసిన క్షణం ఎదుట నిలిచినందుకు.. ఆనందం వెల్లివిరిసింది.

పాప చుట్టూ ఉన్న అందరికీ మాత్రం వింతతో పాటూ భయంగానూ ఉంది. దానికి కారణం.. పాప పుట్టిన తేదీ **ఎనిమిదో తారీఖు, ఎనిమిదో నెల, ఎనభైఎనిమిదో సంవత్సరం...! ఇన్ని అష్టములలోనా అని...!!**

* * *

"కాత్యాయినికి సుఖప్రసవమైందటరా.. రామచంద్రా.." అప్పుడే ఇంటికి వచ్చిన కొడుకుతో ఆత్రంగా చెప్పింది అతని తల్లి అన్నపూర్ణ.

"ఎప్పుడూ..?" ఆనందంగా అడిగాడు రామచంద్ర.

"తెల్లారురఝామునట. ఆడబిడ్డట..! కబురు తెచ్చిన మనిషి ఇప్పుడే చెప్పి వెళ్ళాడు. దబ్బపండులా ఉందంటరా

పిల్ల. మొదటి చూలు మహాలక్ష్మి పుట్టినట్టే. నువ్వు అదృష్టవంతుడువిరా. మీ ముత్తాతతరం నుంచి మన వంశంలో ఆడపిల్లే లేదు. మళ్ళీ ఇన్నేళ్ళకి మనింట్లో ఆడపిల్ల అచ్చటాముచ్చటా చూడబోతున్నాం. ఎప్పుడు వెళదామో చెప్పు ముందు.." సంతోషంతో ఆమె ఉక్కిరిబిక్కిరవుతూ అడిగిందామె.

"పనంతా అయిపోయింది. నువ్వే చెప్పు. ఎప్పుడు వెళదాం..?" తల్లి ముఖంలోని ఆత్రాన్ని చూసి నవ్వుతూ అన్నాడు రామచంద్ర.

"ఎప్పుడో ఎందుకు ఇప్పుడే వెళదాం. ఉండు బట్టలు సర్దుతాను..." అంటూ గబగబా గదిలోకి వెళ్ళింది అన్నపూర్ణ.

ఆవిడకు మనవరాల్ని ఎప్పుడెప్పుడు చూస్తానా అని ఆత్రంగా ఉంది. ఎందుకంటే కబురు తెచ్చినతను, 'బిడ్డంటే బిడ్డ కాదమ్మొగారూ.. ఏం రంగూ.. ఏం నవ్వూ.. ఏం రూపం..' అంటూ వర్ణించి వర్ణించి మరీ చెప్పాడు.

ఆ సాయంత్రం చీకట్లు ముసురుకునే వేళకి కాత్యాయిని వాళ్ళింటికెళ్ళారు రామచంద్ర, అతని తల్లి అన్నపూర్ణలు. చుట్టుపక్కల ఇళ్ళ వాళ్ళందరూ పాపని చూసి అబ్బురపడిపోతున్నారు, 'ఎంతందంగా ఉందీ' అని. అన్నపూర్ణ హడావుడైతే ఇక చెప్పనలవి కాదు. నెలరోజులకే కోడల్ని ఇంటికి పంపెయ్యమని కూర్చుంది.

'నెలలో ఎలా పంపిస్తాం... మూడో నెలలో పంపుతాం..' అన్నారు కాత్యాయిని తల్లిదండ్రులు.

* * *

**అంగలూరు**కి సరిహద్దుల్లో విసిరి పడేసినట్టున్న మరో ఊరు '**ఆలమూరు**'.

ఒకప్పుడు ఈ రెండు ఊర్లూ ఒకే ఊరుగా ఉండేవట. కానీ, చరిత్రలో ఎప్పుడు విడివడ్డాయో ఎవరికీ తెలీదు. తెలిసినదల్లా- అంగలూరు అనే రాజ్యంలో యుద్ధం జరిగిందనీ, ఆ యుద్ధం జరిగిన ప్రాంతమే ఇప్పుడు ఆలమూరు అనీ.

ఊరి పేరుకున్న చరిత్రే తప్ప ఊర్లో హంగూ, ఆర్భాటాలూ.. ఏమీ కనిపించని చిన్న పల్లెటూరు ఆలమూరు. ఆ ఊరికి కరణం రాజగోపాల్. అతని తండ్రి అతి మంచితనం వల్ల వాళ్ళకున్న పొలాలూ, ఆస్థులూ అన్నీ కరిగిపోగా ఆయన నుంచి వచ్చిన కరణం గిరీ మాత్రం మిగిలింది రాజగోపాల్‌కి.

తండ్రి భావాలని పుణికి పుచ్చుకున్న రాజగోపాల్ కూడా అదే బాటలో ఉన్నాడిప్పుడు.

ఆలమూరులోని స్కూలుకి మాష్టారిగా వచ్చిన వసంతరావ్‌కి తన మండువా లోగిలిలోనే ఉచితంగా ఉండమని ఒక పోర్షను ఇచ్చాడు రాజగోపాల్. ఈ రోజు- భార్య సుశీలతో సహా వచ్చి ఇంట్లో పాలు పొంగించాడు మాష్టారు వసంతరావ్.

కరణం రాజగోపాల్ కి ముగ్గురు సంతానం. అప్పుడే ఊహ తెలుస్తున్న ఇద్దరు మగ పిల్లలు, ఇంకా చంకలోనే ఉండే ఒక ఆడ పిల్ల. మొత్తం అయిదుగురితో పాటూ రాజగోపాల్ తల్లీతండ్రి కూడా. ఏడుగురు ఉన్న ఇంట్లో సంపాదించే తల ఒక్కడిదే కావడం, అందరిదీ దయగల స్వభావం అవడంతో ఇంట్లోనుంచి బయటకి వెళ్ళేవేగానీ బయటి నుంచి ఇంట్లోకొచ్చేది చాలా తక్కువ. అందుకే.. ఊరికి కరణం హెూదాయే ఐనా అతని ఇంట్లో మాత్రం పేదరికం ఉండేది.

* * *

మూడోనెలలో పాపతో అంగలూరులో అడుగుపెట్టింది కాత్యాయిని. ముట్టుకుంటే మాసిపోయేలా కాంతివంతంగా ఉందని పాపకి ఉజ్వల అని పేరు పెట్టారు.

'మనవరాలు ఎప్పుడొస్తుందా..' అని రోజులు లెక్కబెట్టుకుంటూ ఎదురుచూస్తున్న అన్నపూర్ణకి వాకిట్లో అడుగు పెట్టిన కోడలు కాత్యాయినిని చూడగానే ఎక్కడలేని సంతోషం వచ్చేసింది. చెంగున లేచెళ్ళి ఎర్రనీళ్ళు, గుమ్మడికాయ దిష్టి తీసీతీయడంతోనే మనవరాల్ని అందుకుంది. ఆ క్షణం నుంచి అన్నపూర్ణ పాపని అస్సలు వదలడంలేదు, ఒక్క పాలు తాగడానికి తప్ప. అన్నపూర్ణ సమక్షంలో పాప కేరింతలు కొడుతూ, కిలకిలా నవ్వుతూనే ఉండేది.

రెండు రోజుల తరువాత.. ఓ సందేహం వచ్చింది అన్నపూర్ణకి, తన మనవరాలు అస్సలు ఏడవదేంటా అని. అదే విషయాన్ని కోడల్ని అడిగిందావిడ.

"ఏమో అత్తయ్యా. అమ్మాళ్ళింట్లో కూడా ఎప్పుడోగానీ ఏడిచేది కాదు.." అంటూ అబద్ధం చెప్పేసింది కాత్యాయిని. అత్తగారితో పైకలా చెప్పినా, మనసులో మాత్రం చాలా భయంగా ఉంది. 'పుట్టిన దగ్గర్నుంచి ఇప్పటివరకూ.. పిల్ల అసలు ఏడవలేదేంటా..' అని.

* * *

ఎండాకాలం మొదలైందనడానికి సూచనగా సాయంత్రం వేళ అవుతున్నా, వాతావరణం ఇంకా వెచ్చగానే ఉంది.

ఆలమూరు ప్రభుత్వ పాఠశాలనుంచి తోటకూరకాడలా వేలాడుతూ ఇంటికి వచ్చాడు రాజగోపాల్ పెద్ద కొడుకు అయిదేళ్ళ నాని.

"అమ్మా..! అమ్మా..!" అని అరుచుకుంటూ ఇల్లంతా తిరిగాడు. ఎక్కడా తల్లి విజయగానీ, తమ్ముడు చిన్నాగానీ, చెల్లి సీతగానీ కనిపించలేదు. మళ్ళీ అమ్మా అని పిలవబోతుంటే ఎవరిదో గట్టిగా అరుపు వినిపించింది.

ఒక్క క్షణం ఉలిక్కిపడి, భయపడ్డాడు నానీ.

ఆ గొంతు ఎవరిదో గుర్తుపట్టడంతోనే ఆ అరుపు వసంతరావ్ మాష్టారి వాటాలోంచి అని అర్థమైంది నానీకి. వెంటనే అరుపు వినిపించిన వైపు రివ్వున పరిగెత్తాడు. మాష్టారు వాళ్ళింట్లోకి వెళ్ళేసరికి, అక్కడ కరెంటు తీగని పట్టుకుని వణుకుతున్న మాష్టారుగారి భార్య సుశీల కనిపించింది.

మొన్నొకరోజు పాఠశాలలో జరిగిన సంఘటన, హడావుడీ గుర్తొచ్చాయి నానీకి. దానితోపాటే.. ఆ రోజు హెడ్ మాష్టారు పిల్లలందర్నీ కూర్చోబెట్టి చెప్పిన ఉపన్యాసమూ గుర్తొచ్చింది. అంతే.. చుట్టూచూసి ఓ మూలన చీపురుపక్కనేఉన్న పెద్దకర్రని లాగాడు నాని. ఢాంమని కిందపడిందది. పైకి లేపబోతే సాధ్యంకాలేదు. అయినా ఎంతో బలాన్ని ఉపయోగించి కర్రని లేపి దాంతో కరెంటుతీగని కొట్టబోతే, ఆ కర్ర బరువుగా ఉండడంవల్ల నాని చేతుల్లోంచి పట్టుతప్పి, ఆవిడ చేతిమీద ఒక్కసారిగా పడిందది.

సుశీల చేతికి తగిలి, ఠంగ్‌మని శబ్దం చేస్తూనే కర్ర కింద పడిపోయింది. ఆ కర్రతోపాటూ కరెంటు వైరునుంచి విడివడి సుశీల కూడా కింద పడిపోయింది.

జాగ్రత్తగా వైరుని తాకకుండా ఆవిడదగ్గర కూర్చొని, అప్పటికే అలవాటైన పిలుపుతో "పిన్నిగాలూ.. పిన్నిగాలండీ.." అంటూ ఆవిడ్ని కుదుపుతూ గట్టిగా పిలిచాడు నాని.

ఆవిడలో ఉలుకూ పలుకూ లేదు.

ఆ రోజు పాఠశాలలోని ఫ్యానుకి కరెంటు వైరు తగిలి పడిపోయినప్పుడు, టీచర్లు ఏం చేశారో గుర్తుకు తెచ్చుకున్నాడు నాని. బయటకి వెళ్ళి గ్లాసుడు నీళ్ళు తెచ్చి, గుప్పెడు నీళ్ళని ఆమె ముఖంమీద చిమ్మాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Valapu+Sankellu](http://kinige.com/book/Valapu+Sankellu)**

* * *